క్లుప్తంగా

వీరభద్ర స్వామి ఊరేగింపు


కైరుప్పలలో ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

ఆస్పరి: మండలంలోని కైరుప్పలలో వెలసిన వీరభద్ర స్వామి, కాళికాదేవి వివాహ నిశ్చితార్థ ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఆలయంలో స్వామి, అమ్మవారికి గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పార్వతి, పరమేశ్వరులతో పాటు వీరభద్రస్వామి, కాళికాదేవి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగించారు. నందికోలు సేవ, కళాకారుల చెక్క భజన ఆకట్టుకుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

విరివిగా పంట రుణాలు

తుగ్గలి: సహకారం సంఘం ద్వారా రైతులకు విరివిగా పంట రుణాలు మంజూరు చేస్తున్నట్లు మారెల్ల ఆశోక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) అధ్యక్షుడు అట్ల గోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పెండేకల్లు రైల్వే జంక్షన్‌లోని సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ .. బ్యాంకు పరిధిలో 2 వేల మందికి పంట రుణాల కింద రూ.8 కోట్లు, మరో 900 మందికి రూ.28 కోట్లు దీర్ఘకాలిక రుణాలు అందించామన్నారు. కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకు సీఈఓ మనోహరనాయుడు, సిబ్బంది మధు, చాంద్, కాశీం, డైరెక్టర్లు మధుసూదన్ రెడ్డి, తిమ్మప్ప పాల్గొన్నారు.

ఆటస్థలం పరిశీలన

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహించతలపెట్టిన 'ఆడుదాం - ఆంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ నరసింహామూర్తి, ఎంఈఓ రంగస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆట స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు 1957 మంది క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. 15 ఏళ్లు నిండిన యువతీ యువకులు నమోదు చేసుకోవచ్చన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆటల్లో ప్రతిభను మెరుగుపరుచుకొని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. పీడీ రంగయ్య ఉన్నారు.

విజేత వృషభాల ఊరేగింపు

నందవరం: మండల పరిధిలోని హాలహర్వి గ్రామానికి చెందిన బోయ ఈరన్న వృషభాలను మంగళవారం గ్రామంలో ఊరేగించారు. సోమవారం ఆస్పరి మండలంలోని కైరుప్పల గ్రామంలో వీరభద్రస్వామి, కాళికాదేవి నిశ్చితార్థ మహోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఎద్దుల గిరక బండి పోటీలు జరిపారు. ఈ పోటీల్లో హాలహర్వికి చెందిన బోయ ఈరన్న వృషభాలు 13 రౌండ్లలో గిరకబండిని 3831.5 మీటర్ల దూరం లాగి విజేతగా నిలిచాయి. వృషభాల యజమాని బోయ ఈరన్న మొదటి బహుమతి రూ.25 వేలు అందుకున్నారు. దీంతో మంగళవారం గ్రామంలో వృషభాలను తప్పెట్ల మోత మధ్య పురవీధుల్లో ఊరేగించారు.

ముగిసిన షష్ఠి ఉత్సవాలు


మద్దికెరలో పూజలందుకుంటున్న స్వామి వారు

మద్దికెర: స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్ఠి ముగింపు ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదాన చేశారు. రాత్రి స్వామి వారి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రదక్షిణలు చేసి పల్లకీసేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. రాత్రి తెనాలి, రాయలసీమ వారిచే నాటకం ప్రదర్శించారు.

ఆరోగ్యశ్రీ పరిమితి పెంపుపై హర్షం

చిప్పగిరి: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతూ క్యాబినెట్ ఆమోదం తెలపడంపై ఎంపీపీ జూటూరు హేమలత హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆమె మట్లాడుతూ 3200కు పైగా జబ్బులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తేవడం వల్ల పేదలకు మేలు జరుగుతుందన్నారు. ఇకపై పేదలు రూ.25 లక్షల వరకు ఆరోగ్య సేవలను ఉచితంగా పొందవచ్చని వివరించారు. కన్వీనర్ మారయ్య, లింగన్న, లాల్ స్వామి తదితరులు ఉన్నారు.

వెల్దుర్తి.. అభివృద్ధిలో ఘన కీర్తి

- అత్యాధునిక వసతులతో 30 పడకల ప్రభుత్వాసుపత్రి, వెల్దుర్తి నుంచి రామళ్లకోట వరకు డబుల్ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం
- నేడు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ఏళ్ల నాటి సమస్యల పరిష్కారంపై ప్రజల హర్షం


వెల్దుర్తిలో రూ.5.77 కోట్లతో నిర్మించిన ప్రభుత్వాసుపత్రి


వెల్దుర్తి టు రామళ్లకోట మధ్య నిర్మించిన డబుల్ రోడ్డు

వెల్దుర్తి(కృష్ణగిరి): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాలనలో నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలం అభివృద్ధిలో ఘన కీర్తి దక్కించకుంది. ఉద్దండులమని చెప్పుకునే గత పాలకులు ప్రజలను వంచించగా, ఎమ్మెల్యేగా గెలిచిన మొదటిసారే ప్రగతి అంటే ఇది అని ఎమ్మెల్యే శ్రీదేవి చేతల ద్వారా చూపించారు. నియోజకవర్గ ప్రజలు, రైతుల భవిష్యత్తును తీర్చిదిద్దేలా పత్తికొండ, డోన్, వెల్దుర్తి, కల్లూరు మండలాల చెరువులను హంద్రీ - నీవా నీటితో నింపడం, టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు పునాది వేశారు. నియోజకవర్గంలోని ప్రతి మండలాన్ని ఎంతో దీక్షతో అభివృద్ధి చేస్తూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపారు. వెల్దుర్తి మండలంలో నెలకు రెండ్రోజులు మాత్రమే కుళాయి నీరు అందించే దుస్థితి నుంచి రూ.3.5 కోట్లతో కృష్ణగిరి రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ వేయించి ప్రతిరోజు సురక్షిత తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఏళ్ల తరబడి అంబులెన్స్ వెళ్లాలన్నా కష్టంగా ఉండే శ్రీరంగాపురం, లక్ష్మంపల్లె తదితర గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించారు. అలాగే వెల్దుర్తి పట్టణంలో రూ.5.77 కోట్లతో నిర్మించిన 30 పడకల సామాజిక నూతన ఆసుపత్రి భవనం, రూ.12 కోట్లతో వెల్దుర్తి నుంచి రామళ్లకోటకు నిర్మించిన డబుల్ రోడ్డు, వెడల్పు చేసిన బ్రిడ్జి బుధవారం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభం కానున్నాయి.

కార్పొరేట్ స్థాయిలో వసతులు

ఇప్పటివరకు వెల్దుర్తిలో 10 పడకల సామాజిక ఆస్పత్రి భవనం పైకప్పు పెచ్చులూడి, వర్షం నీరు కారి, సున్నం ఊడిన చిన్నపాటి పాత భవంతిలో కొనసాగేది. ఈ ఆసుపత్రి వెల్దుర్తి, కృష్ణగిరి, డోన్, ఓర్వకల్, కల్లూరు, కోడుమూరు మండలాల ప్రజలకు, హైవే-44 రహదారి ప్రమాద బాధితులకు ఆరోగ్య సేవలందించడంలో వెనుకబడి, కేవలం ఒక డాక్టరు, ఒక నర్సుతో కొనసాగింది. గత పాలకులు, డిప్యూటీ సీఎం, రెవెన్యూ మినిష్టర్ ఇలా ఎన్నో పదవులు పొందిన ఉద్దండులు సైతం ఈ ఆసుపత్రి అభివృద్ధికి ఏనాడు చొరవ చూపలేదు సరికదా సౌకర్యాలూ మెరుగు పరచలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, కంగాటి శ్రీదేవి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆసుపత్రి అభివృద్ధికి చొరవ చూపారు. పాత భవనం స్థానంలో నాబార్డు నిధులు రూ.5.77 కోట్లతో అన్ని హంగులతో నూతన భవన నిర్మాణం పూర్తయింది. ఆసుపత్రి సామర్థ్యాన్ని పెంచడంతో 30 పడకలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం 9 మంది హోమియో, డెంటల్, పీడియాట్రిక్, గైనకాలజిస్టు, అనస్తీషియా, జనరల్, స్పెషలిస్టు డాక్టర్లు, హెడ్ నర్సు, స్టాఫ్ నర్సులు 9 మంది, మెడికల్ సెంటర్, ఫార్మాసిస్టు, రేడియోగ్రాఫర్, ఇతరత్రా 10కి మించి సిబ్బంది నియమితమయ్యారు. ఆరోగ్యమిత్రలు ముగ్గురి సేవలతోపాటు టీబీ పరీక్షలు, మందులు, అత్యాధునిక ల్యాబ్‌లు, యంత్రాలతో సేవలు, 108 సేవలు, ఆపరేషన్లు, బ్లడ్, వ్యాక్సిన్ బ్యాంకులు అందనున్నాయి. ఒక్కో సేవకు ఆధునిక గదులు ప్రత్యేకంగా నిర్మించారు. కర్నూలు, డోన్‌కు వెళ్లాల్సిన పోస్టు మార్టం సేవలు సైతం ఉన్నాయి.

హైవేను తలదన్నేలా రహదారి

వెల్దుర్తి నుంచి రామళ్లకోటకు గల రహదారి ఆపైనన్నూరు, బేతంచెర్ల, కాల్వబుగ్గ వైపు ప్రయాణాలకు ప్రతిరోజు వేలాది వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గుంతలతోపాటు చిన్నపాటి రహదారిలో ప్రమాదాలు జరుగుతుండేవి. వెల్దుర్తి వంకపై బ్రిడ్జ్ ఇరుకుగా, కూలేందుకు సిద్ధంగా ఉండేది. ఎమ్మెల్యే చొరవతో వెల్దుర్తి టు రామళ్లకోట రహదారికి మహర్దశ పట్టింది. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రూ.10 కోట్లతో డబుల్ రోడ్డు ఏర్పాటు చేయడంతోపాటు వెల్దుర్తి వంకపై మరో రూ.2 కోట్లతో బ్రిడ్జ్ వెడల్పు చేసి ఆధునీకరించారు.

నేడు ప్రారంభోత్సవం

వెల్దుర్తిలో నిర్మించిన 30 పడకల సామాజిక ప్రభుత్వ ఆసుపత్రి, వెల్దుర్తి టు రామళ్లకోట డబుల్ రోడ్డు, వెల్దుర్తి వంకపై బ్రిడ్జిని బుధవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ వెల్దుర్తి మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మెల్యే సహకారంతో మండలంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు ముందుగా ఆసుపత్రి భవనం ప్రారంభం, ఆపై వెల్దుర్తి టు రామళ్లకోట డబుల్ రోడ్డు వెల్దుర్తి వంక బ్రిడ్జ్ ప్రారంభం, తర్వాత స్థానిక పాతబస్టాండులో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, నాయకులు బొమ్మన పెద్దిరెడ్డి, వెంకట్ నాయుడు, ఆరిఫ్, శివారెడ్డి, రాజు, ఎల్లయ్య, మోహన్ పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపారు



మా గ్రామం రామళ్లకోటతోపాటు పదుల సంఖ్యలోని చట్టుపక్కల గ్రామాలు, మండలాల ప్రజలు ఏ అవసరమొచ్చినా వెల్దుర్తికి రావాల్సిందే. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చొరవతో మా గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మించి, స్తంభాల ఎత్తు పెంచి విద్యుత్ సమస్య పరిష్కరించారు. అలాగే డ్రైనేజీ సమస్య తీరేలా కాలువలు నిర్మించారు. వెల్దుర్తి నుంచి గ్రామానికి డబుల్ రోడ్డు నిర్మించి, కాల్వబుగ్గ వైపు రహదారిని మెరుగు పరిచారు. ప్రభుత్వాసుపత్రి మంజూరు చేసి, ఇప్పటికే ఇద్దరు డాక్టర్లను నియమించారు. సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్‌క్లినిక్ ఇలా అన్ని సమస్యలు పరిష్కరించారు. ప్రస్తుతం బేతంచెర్ల వైపు డబుల్ రోడ్డు పనులు కూడా పూర్తి కావొచ్చాయి. అభివృద్ధికి అర్థం చెప్పిన ప్రభుత్వం వైఎస్సార్సీపీనే.

– మాధవస్వామి,
రామళ్లకోట, వెల్దుర్తి మండలం

విద్యుత్‌ను ఆదా చేయండి

పత్తికొండటౌన్: ఇంధన వనరులను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ విద్యుత్ ఆదా చేయాలని విద్యుత్ శాఖ పత్తికొండ డీఈఈ షేక్షావలి సూచించారు. బుధవారం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఇంధన పరిరక్షణ- చిట్కాలు అంశంపై సదస్సు నిర్వహించారు. ఇంధన వనరులను అవసరం మేరకు వాడుకుని, ఆదా చేసుకోవడం వల్ల భావితరాల వారికి వెలుగులు అందించవచ్చన్నారు. నిత్య జీవితంలో విద్యుత్‌ను ఆదా చేసుకునే విధానాలను వివరించారు. ఏఈ నారాయణ స్వామి, ఎస్ఎల్ఐ తిమ్మప్ప, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సమీక్షా సమావేశం

పత్తికొండటౌన్: పత్తికొండలో బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఆదోని రోడ్డులోని గోపాల్ ప్లాజాలో నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్డీఓ నీలవు రామలక్ష్మి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆర్డీఓ మాట్లాడుతూ.. సమావేశానికి రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు.

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ

హాలహర్వి: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహార కిట్లు వస్తాయని సచివాలయ సిబ్బంది వాటిని భద్రంగా నిల్వ చేయాలని ఎంపీడీఓ ఆంతోని ఆదేశించారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. అంగన్‌వాడీ వర్కర్లు సమ్మెలో ఉన్నందున ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను సచివాలయ అధికారులకు హ్యాండ్ ఓవర్ చేయడం జరిగిందన్నారు. సిబ్బంది సకాలంలో బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

శ్రీరాముడి చిత్రపటంతో శోభాయాత్ర

ఆస్పరి: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆస్పరిలో మంగళవారం జనార్దన స్వామి ఆలయంలో హిందూ ధర్మ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదర్భంగా శ్రీరాముని చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. అయోధ్య రామమందిరం నుంచి తెచ్చిన అక్షింతలను భక్తులకు పంపిణీ చేశారు. బ్రహ్మశ్రీ సుంకయ్య, నారాయణస్వామి, వెంకట్రాముడు భక్తులకు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు


నందవరం సచివాలయం-2లో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ దశరథరామయ్య

నందవరం: సచివాలయ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ దశరథరామయ్య హెచ్చరించారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయం-2, ముగతిలోని గ్రామ సచివాలయం-2ను ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ చేపట్టి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను డాష్ బోర్డులో ఏర్పాటు చేయాలన్నారు. విధులకు హాజరు కాని ఇద్దరి సచివాలయ సిబ్బందికి మెమోలు జారీ చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం- ఆంధ్ర' కార్యక్రమంపై దృష్టి సారించాలన్నారు. ఈ నెల 26వ తేదీన ప్రారంభమయ్యే క్రీడా టోర్నీని విజయవంతం చేసేలా సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ కార్యదర్శి రామకృష్ణ ఉన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధి



మైనారిటీ కాలనీలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎర్రకోట జగన్

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం 21వ వార్డు పరిధిలోని హెచ్‌బీఎస్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగనన్న సారథ్యంలోని వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. వార్డు ఇన్‌చార్జ్ మురహరిరాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రియాజ్‌అహమ్మద్, బుట్టారంగయ్య, నజీర్‌అహమ్మద్, యుకె రాజశేఖర్, షబ్బీర్‌అహమ్మద్, సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆలూరులో హడలెత్తిస్తున్న దొంగలు

ఆలూరు రూరల్: పట్టణంలో గత నెల రెండు నెలలుగా దొంగలు హడలెత్తిస్తున్నారు. గత 10 రోజుల క్రితం మెయిన్ బజారులో ఒకే రోజు రాత్రి 5 ఇళ్లలో వరుస చోరీలకు పాల్పడ్డారు. ఈ దొంగతనాలు మరువక ముందు ఆలూరులోని హైవే 167లో ఉన్న ఎంపీడీఓ కార్యాలయం ముందు గోపాల్ అనే వ్యక్తికి చెందిన రూ.50 వేలు విలువ చేసే టీస్టాల్ సెట్‌తో పాటు అందులో ఉన్న రూ.10 వేలు విలువ చేసే రెండు సిలిండర్లు, టిఫిన్ తయారీ సామగ్రిని సోమవారం రాత్రి ఎత్తుకెళ్లారని బాధితుడు గోపాల్ వాపోయాడు. మంగళవారం ఉదయం హోటల్ తెరవడానికి వచ్చి చూడగా స్టాండ్ లేకపోవడంతో అవాక్కయ్యాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా


మాట్లాడుతున్న పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

హొళగుంద: రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా పెడ్తున్నామని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆలూరు సీఐ వెంకటేశ్వర్లతో కలిసి హొళగుంద పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులను పరిశీలించి నేరాలు, కేసుల పూర్వపరాలు, ఇతర విషయాల గురించి ఎస్ఐ శ్రీనివాసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించామన్నారు. అలాగే కర్ణాటక నుంచి అక్రమంగా లిక్కర్ రవాణా జరగకుండా సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


గ్రామపెద్దలకు నగదు అందజేస్తున్న గుమ్మనూరు నారాయణస్వామి, ఈశ్వర్

హొళగుంద: మండల కేంద్రం శివారులోని కడ్లమాగి రస్తా పెద్ద చెరువు గట్టుపై వెలసిన గాయత్రి దేవి ఆలయ నిర్మాణానికి మంత్రి గుమ్మనూరు జయరాం సూచన మేరకు ఆయన సోదరుడు నారాయణస్వామి, తనయుడు ఈశ్వర్ మంగళవారం రూ.42 వేలు నగదును విరాళం అందించారు. దేవి ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామపెద్దలు నూతన ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్టాపనకు పూనుకున్నారు. మంగళవారం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తోక వెంకటేష్ కుమార్తె వివాహానికి వచ్చిన నాయకులకు వారు విషయాన్ని తెలిపారు. వారు రూ.42 వేల నగదును ఆలయ కమిటీ సభ్యులు ఈరప్పకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు ఈశా, పాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మి

మద్దికెర: బాలికలు ఆరోగ్యం పట్ల నిరంతరం జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారిణి శ్రీలక్ష్మి సూచించారు. మంగళవారం స్థానిక ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు. వైద్యులు సంక్షేమ అధికారులు, ఉపాధ్యాయుల సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. భోజనం చేసేముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. జ్వరం, జలుబు వస్తే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందాలన్నారు. సంక్షేమ అధికారి ఉష, ఏఎన్ఎం అంజలి, ఆశా కార్యకర్త ఫాతిమా ఉన్నారు.

ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యం వద్దు

ఆలూరు రూరల్: ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యం వహించవద్దని ఆలూరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి మల్లికార్జున సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ముసాయిదా ఓటరు జాబితాలో తప్పులు ఉంటే ఆయా పోలింగ్ కేంద్రాల బీఎల్ఓలను సంప్రదించి సరి చేసుకోవాలన్నారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటు హక్కు పొందాలని చెప్పారు. పేరు, చిరునామా, వయసు మార్పు ఉన్న ఓటర్లు ఆన్‌లైన్ లేదా నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో ఫారం-7 అందించి తప్పులు సరిచేసుకోవాలని సూచించారు. ఎన్నికల డీటీ గుండాల్ నాయక్, డీటీ విజయ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ బసన్న గౌడ్ తదితరులు హాజరయ్యారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని క్రిస్టియన్ రిఫార్మ్ చర్చి ఆవరణలో మంగళవారం నిర్వహించిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు ఆయన సతీమణి సునీల 250 మంది వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేశారు. సామాజిక వేత్త ఉమ్మిసలీం, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో చోటు

ఆలూరు: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా కమిటీల్లో ఆలూరు నియోజకవర్గం నుంచి పలువురికి పదవులు కేటాయిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా లింగమల్లప్ప, కార్యదర్శులుగా ఈరన్న, రాఘవేంద్ర, ఉపాధ్యక్షులుగా రామచంద్ర, సహాయ కార్యదర్శులుగా కురువ గిరి, నరసింహులును నియమించారు.

➡ జిల్లా సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శిగా బీరప్ప, కార్యదర్శులుగా గోపాల్‌రెడ్డి, సిద్దప్ప సహాయ కార్యదర్శులుగా రమేష్, రాఘవేంద్ర

➡ క్రిస్టియన్ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శిగా కరుణాకర్, కార్యదర్శులుగా గోవిందు, రంగనాథ్ సహాయ కార్యదర్శులుగా నాగేష్

➡ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలుగా బోజ్జమ్మ, ప్రధాన కార్యదర్శిగా కృష్ణవేణి కార్యదర్శులుగా అయ్యమ్మ, హనుమంతమ్మ, సహాయ కార్యదర్శులుగా వెంకటలక్ష్మి, మంజుల

➡ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎం.రఫీక్ కార్యదర్శులుగా బాబు, గఫూర్, సహాయ కార్యదర్శులుగా ఉమర్, గఫూర్

➡ పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా ఎం.అరుణకుమార్ ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీదేవి, సహాయ కార్యదర్శులుగా ఉలిగప్ప, శ్రీనివాసులు

➡ ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శిగా టి.శ్రీనివాసులు, కార్యదర్శులుగా లింగప్ప, విజయ్, సహాయ కార్యదర్శులుగా సి.శ్రీను, వెంకటేష్

➡ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా లక్ష్మిరెడ్డి, యల్లప్ప, సహాయ కార్యదర్శులుగా రమేష్, జయరాం

➡ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జి.సత్యరాజ్, కార్యదర్శులుగా జి.ఎల్లప్ప, పాండు, సహాయ కార్యదర్శులుగా వై.ఆంజనేయుడు, దీపక్‌రాజ్‌ను నియమించారు.

➡ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తిక్కస్వామి నాయక్, ఉపాధ్యక్షుడిగా రామునాయక్, కార్యదర్శిగా నరసయ్య, మోతానాయక్, సహాయ కార్యదర్శిగా రామునాయక్

➡ విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కృష్ణ, కార్యదర్శులుగా డీపీ రాజశేఖర్, కె.లింగమూర్తి, సహాయ కార్యదర్శులుగా జనార్దన్‌నాయుడు, ఎం.యు.వేణుగోపాల్

➡ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శిగా బసవరాజ్, కార్యదర్శులుగా టి.వెంకటేష్, తిమ్మయ్య శెట్టి, సహాయ కార్యదర్శులుగా నాగరాజ్, సి.బాబు

➡ వికలాంగుల విభాగం ప్రధాన కార్యదర్శిగా ఆనంద్, కార్యదర్శులుగా మల్లికార్జుననాయక్, జలంధర్, సహాయ కార్యదర్శులుగా రామాంజనేయులు, దేవరాజ్

➡ చేనేత విభాగం ప్రధాన కార్యదర్శిగా బుట్టా రమేష్

➡ యూత్ వింగ్‌కు జిల్లా ప్రధాన కార్యదర్శిగా జి.రంగన్న, కార్యదర్శులుగా శ్రీనివాసరెడ్డి, ఎ.వీరేష్ సహాయ కార్యదర్శులుగా దివాకర్‌నాయుడు, ప్రభాకర్‌నాయుడు

➡ వైఎస్సార్ సేవాదళ్ విభాగం ప్రధాన కార్యదర్శిగా రవికుమార్‌రెడ్డి, కార్యదర్శులుగా ఎ.మల్లయ్య, భాస్కర్, సహాయ కార్యదర్శులుగా టి.రమేష్, వెంకటేష్

➡ వైఎస్సార్‌టీయూసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వై.బాలయ్యశెట్టి, కార్యదర్శులుగా గోపాల్ శెట్టి, సహాయ కార్యదర్శులుగా సి.చిన్నయ్యశెట్టి, నాగరాజ్‌లను నియమించారు.

వైఎస్సార్ క్రికెట్ టోర్నీకి ఏర్పాట్లు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో జనవరి 27 నుంచి జరగనున్న నీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవం సందర్భంగా వైఎస్సార్ అంతర్రాష్ట్ర టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. టోర్నీ ఆర్గనైజరైన మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ ఆధ్వర్యంలో స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో సీసీ పిచ్ (ఆర్సీ మ్యాట్) నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులను మంగళవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పరిశీలించారు. దాదాపు నెలరోజుల పాటు నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో వందకు పైగా జట్లు పాల్గొననున్నందున క్రీడాకారులకు ఇబ్బందుల్లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రియాజ్‌అహమ్మద్, బుట్టారంగయ్య, యుకె రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

భూసర్వే పక్కాగా నిర్వహించాలి

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వేను రైతులకు ఇబ్బందులు కలగకుండా పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ నాగభూషణంకు రైతులు జయభరత్‌రెడ్డి, అనిమిరెడ్డి, సుబ్బయ్య విన్నవించారు. మంగళవారం కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని బురుజుల గ్రామంలో చాలా మంది రైతులకు సంబంధించి పట్టాదారు పాస్‌బుక్‌లలో ఉండే కొలతలకు, అధికారులు చేస్తున్న సర్వేలో భూముల కొలతలకు వ్యత్యాసం ఉంటోందని, దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి రైతులకు ఇబ్బందులు కలగకుండా సర్వే నిర్వహించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్వే నిర్వహిస్తామని, సమస్యలు తలెత్తకుండా పరిష్కరిస్తామన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి


మాట్లాడుతున్న తహసీల్దార్ నిత్యానందరాజు

నందవరం: ప్రభుత్వం పంపిణీ చేసే నిత్యావసర సరుకులను రేషన్ డీలర్లు, మొబైల్ ఎండీయూ ఆపరేటర్లు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ నిత్యానందరాజు సూచించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీలర్లు, మొబైల్ ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మొబైల్ ఎండీయూ ఆపరేటర్లు వాహనాల ద్వారా నిత్యవసర సరుకులను ఇంటింటికీ పంపిణీ చేయాలన్నారు. తేదీల వారీగా రేషన్ పంపిణీ చేసి, ప్రతి నెలా 15వ తేదీలోపు ముగించాలన్నారు. డీలర్లు బ్యాక్ లాగ్ రేషన్ ఉంటే సరిచూసుకోవాలన్నారు. రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీనియర్ అసిస్టెంట్ జనార్దన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ కిశోర్ పాల్గొన్నారు.

చెరువులకు నీటి మళ్లింపుతో కరువు దూరం


గంగమ్మ పూజ చేస్తున్న జగన్నాథరెడ్డి

తుగ్గలి: చెరువులకు నీటి మళ్లింపుతో కరువు నుంచి విముక్తి లభించిందని వైఎస్సార్‌సీపీ నాయకుడు జగన్నాథరెడ్డి అన్నారు. మంగళవారం పగిడిరాయిలో చెరువులోకి పారుతున్న హంద్రీ జలాలకు గంగమ్మ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చెరువులకు నీటిని మళ్లించి కరువు నివారణకు కృషి చేస్తోందన్నారు. నీటి మళ్లింపుతో అదనపు ఆయకట్టు సాగైతిండి గింజలతో పాటు, పశుగ్రాసానికి ఢోకా ఉండదన్నారు. భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య తీరుతుందని చెప్పారు. కూలీలు వలసపోకుండా స్థానికంగానే పని దొరుకుతుందని వివరించారు. అన్నదాతల సంక్షేమానికి నిత్యం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బసిరెడ్డి, మణిదీప్‌రెడ్డి పాల్గొన్నారు.